

Office of the Reg... Andhra Pradesh, Hyderabad
25 NOV 2002
502/R0?

# శివతాండవము

'సరస్వతీపుత్ర'

పుట్టపర్తి

# శివతాండవము

Office of the Registrar of Publications, Andhra Pradesh, Hyderabad-500012
5 NOV 2002

రచన:
మహాకవి, సరస్వతీపుత్ర, పద్మశ్రీ
"పుట్టపర్తి"

ప్రచురణ:
రవి ఎకడమిక్ సొసైటి (రిజిస్టర్డ్)
గుంటూరు

Rs.100



ప్రత్యేక ముద్రణ

నవంబరు 1985

హక్కులు : రచయితవి.

ప్రతులకు

డాక్టర్. పుట్టపర్తి నారాయణాచార్యు
6/52 రామారావు వీధి
కడప - ఆంధ్రప్రదేశ్.


ఆఙ్గికం భువనం యస్య
వాచికం సర్వవాఙ్మయం
ఆహార్యం చన్ద్రతారాది
తం నుమస్సాత్త్వికం శివమ్

# తొలిపలుకు

ఇప్పటికి శివతాండవం పదిసార్లైనా ప్రింటు అయివుంటుంది. కానీ, నేను ఆర్థికంగా లాభపడింది మాత్రం చాలా తక్కువ. కారణాలు అనేకాలు. ముఖ్యంగా ఈ రాయలసీమ చీకటి ఖండం ఈ ప్రాంతాల్లోనే గడ్డకువచ్చి ఒక పేరూ, ప్రతిష్ఠా సంపాదించుకోవాలంటే చాలా కష్టం. సాహిత్యకంగా నా జీవితంలో ఎన్నో కల్లోలాలు ఎదుర్కోవలసివచ్చింది. ఒకసారి గుంటూరికి సాహిత్య మిత్రులు కొందరు సన్మానిహ్వానించినారు. నాకు శరీర ఆరోగ్యముకూడా సరిగాలేదు అప్పుడు. ప్రయాణానికి కావలసిన జాగ్రత్తలన్నీ వారే చూచుకున్నారు. రామాయణం పైన నా ఉపన్యాసం. ఒక వేయినూట పదహార్లిచ్చి సత్కరించినారు. ఆ సందర్భంలో శ్రీ ధన్‌గారు నాకు పరిచయమైనారు. ఆయన సాహితీ ప్రేమికుడు. జీవితంలో కష్టసుఖముల నెరిగినవాడు. నన్నుగూర్చి వారికంతకుముందే తెలును. వారు కొన్నివేలు ఖర్చుపెట్టి మంచి బొమ్మలతోపాటు శివతాండవాన్ని మరలా ముద్రించి యిస్తానని పూనుకొన్నారు. వారి యౌదార్యాన్ని నేనెట్లు గౌరవించవలెనో నాకు తెలియదు. చిరంజీవి రామమోహనరాయ్, మరికొందరు వారి ప్రయత్నానికి హర్షించి వారికి తోడైనారు. వీరందరికిన్నీగూడా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెల్పుకోవడం తప్ప మరేమీ చేయలేను.

శ్రీశ్రీగారి 'మహాప్రస్థానం'లాగా 'శివతాండవా'న్ని ముద్రించి పెద్ద వెలపెట్టి నా కార్థికంగా యేదైనా ఉపయోగపడేటట్లు చూడాలని శ్రీ ధన్‌గారు సంకల్పించారు. ఋణానుబంధాలు మహా విచిత్రంగా వుంటాయి. భౌతికాలైనా కారణాలతో వాని స్వరూప నిర్ణయాన్ని చేయడం నాయోగ్యతకు మించినపని.

నా పుస్తకాలలో నాకు ఎక్కువ ఖ్యాతి తెచ్చింది శివతాండవమేనని చెప్పవచ్చు. అనేక సంవత్సరాలుగా, అనేక సభల్లో విన్పించడం జరిగింది. విన్పించిన చోటంతా దాన్ని గూర్చిన పొగడ్తలేతప్ప, మరేమీ వినలేదు. ఇతర భాషలవారుకూడా తెనుగురానివారుకూడా దీన్ని విని ఎంతో మెచ్చుకొనేవారు. తిరువాన్కూరులో వున్నప్పుడు ఢిల్లీలో వున్నప్పుడుకూడా దీన్నిగూర్చిన పొగడ్తలే ఢిల్లీలో రష్యన్ ఎంబసీవారుకూడా 'శివతాండవాన్ని' చదివించుకొని విన్నారు. ఆ కావ్యంలో అనుభూతంగావచ్చే 'లయ' వాళ్ళ నంతగా ఆకర్షించి వుంటుందను కున్నాను. దీనిని వ్రాసేటప్పుడు–ప్రొద్దుటూరులో అగస్త్యేశ్వర స్వామికి చాలా నియమంగా ప్రదక్షిణాలు చేసేవాడిని. రోజూ 108 ప్రదక్షిణాలు. కోవెల చాలా పెద్దది. అప్పుడు వ్రాసినదీ కావ్యం. కావ్యం చాలా చిన్నగా వుందని, కొద్దిగా పెంచుదామని ఎంతెంతో ప్రయత్నించినాను. కానీ నాకు సాధ్యం కాలేదు భగవదిచ్ఛ యింతేనేమో అనుకున్నాను.

ఈ కావ్యంలో సంగీత, నాట్య సాహిత్య సంకేతాలు పెనవేసుకొనివున్నాయి. ఆ మూడింటియొక్క సాంప్రదాయాలు కొంతకుకొంత తెలిస్తేగానీ, ఈ కావ్యం అర్థంగాదు. దీనిపైన చిన్న వ్యాఖ్యానం వ్రాస్తే బాగుంటుందని చాలామంది నాకు

సూచించినారు. కానీ కొన్ని విషయాల్లో ఎందుకో నేను బాలా ఉదాసీనం. ఆ పని ఎప్పుడూ చేయలేదు.

అంతమాత్రమేకాదు. ఈ కాలంలో ఒక పుస్తకం వ్రాయడం ఒక నేరం చేసినంతపని. రాస్తే, ప్రింటుకావడం ఒక కష్టం. ఎవ్వడో పబ్లిషరు వేటగానివలె కాచుకొనివుంటాడు. ఇక మనమే అమ్ముకోవాలంటే హత్య నేరం చేసినవాడు తప్పించుకోవడానికి చేసేంత ప్రయత్నంచేయాలి. ఈ బాధలు ప్రతీ రచయితా అనుభవిస్తూన్నవే.

నేను సుమారు నూటికి పైగా గ్రంథాలు వ్రాసినాను. గద్యమూ, పద్యమూ రెండూ వున్నాయి. మరి యెందుకో నా పేరూ శివతాండవ గ్రంథమూ పెనవేసుకొని పోయినవి. ఇదికూడా ఒక భవగవత్ చిత్రమే, ఈ గ్రంథం ఇతర భాషల్లోకూడా పరివర్తితమయింది. జర్మన్‌లోకి ఎవ్వరో చేసినారు. హిందీలోకి ఇద్దరు ముగ్గురు పరివర్తించినారు. నేను వానిని చూచినానుకూడా ఇటువంటి గ్రంథాలు పరివర్తించడం బాలా కష్టం. ఇటువంటి కార్యాల గౌరవం ముఖ్యంగా శబ్దంపైన ఆధార పడుతుంది. ఇంగ్లీషులోకి తెద్దామని నేనే ఎన్నోసార్లు ప్రయత్నించినాను. కానీ ఆ భాషాంతరీకారణం ఎప్పుడూ నాకు తృప్తినిచ్చింది లేదు. కాళిదాసు ఎన్నో గ్రంథాలు వ్రాసినాడు. ఆయన మేఘసందేశానికెందుకో గొప్ప అదృష్టం పట్టింది. విశ్వనాధవారు ఎక్కడ పోయినా కిన్నెరసాని పాటల్నే చదవమనేవారు.

శ్రీ బాపుగారు ప్రసిద్ధ చిత్రకారులు. వారికెన్నో పనులు. బహుకార్య విఘ్నలెన్నీ నాపై దయతో చిత్రాలని గీచి యిచ్చినారు. వారికి నా మనఃపూర్వక మైన కృతాంజలి. ఇంకొకసారి శ్రీ ధన్‌గారికి, తక్కిన మిత్రులకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

పుట్టపర్తి నారాయణాచార్య

నవంబర
1985

# శివతాండవ కావ్యగుణములు

సత్కావ్యమును పదేపదే చదివి ఆనందించడమే శోభకాని, దానిని విశ్లేషించి అందాలు చూప యత్నించడము శోభ కాదు. అయితే శివతాండవ పునర్ముద్రణ చేయించే సందర్భములో మిత్రులు నేలనూతుల శ్రీ కృష్ణమూర్తిగారు కావ్యగుణ ప్రస్తావన చేయమని నాకు పని పెట్టినారు. ఆ అవకాశాన్ని పురస్కరించుకొని శివతాండవముతో సంబంధము కల్పించుకున్న నా చాపల్యమును సహించి ఈ నాలుగు మాటల తాత్పర్యమును గ్రహించండని మనవి.

తన భావాల్నీ, ఉత్సాహాన్నీ, కరుణనూ, జుగుప్సనూ, భయాన్నీ, హాసాన్నీ చదువరులకు కూడా కలిగించాలని కవికావ్యరచన చేస్తాడు. ఈ భావాలు చదువరికి కలిగి, వాటి ఫలితమైన ఆనందంతో అతని హృదయము సంతుష్టి చెందడాన్ని రసానందము పొందడమంటారు. 'శివతాండవము'లో కవి ఆ తాండవమును ఊహారంగము మీద దర్శించిన ఆశ్చర్యాన్ని మాటలతో పదకవితలో వర్ణిస్తే మనము చదివి ఆశ్చర్య చకితుల మౌతాము. "అలలై, బంగరు కలలై, పగడపు బులుగులవలె, మబ్బులు విరిసినయవి." "చతురాననుడే సవరించునట! శర్వున కుత్తమ సర్వవిభూషలు!" శ్రుతిబట్టుటకు భృంగమ్ములు గొంతులు సవరించెనట! సెల కన్నెలు కుచ్చెళ్ళు లెల్లెడ విచ్చలవిడిగా దుసికిళ్లాడగ నాకసమున పరుగిడేనట, సంధ్యా బిబ్బోకవతి నవకుసుంభరాగవసనము ధరించినదట శివపూజకు! "అర్ధేందూత్ఫుల్ల కేశం" అంటూ నంది దేవభాషలో నాంది నారంభించెనట. వీటన్నిటితో మన అపేక్ష కేంద్రీకృతమౌతుంది. "తలపైన జదలేటి యలలు దాండవమాడ, నలల ద్రోపుడుల గ్రొన్నెల వూవుగదలాడ" శివుడు ఆడ నారంభించేటప్పటికి మనకి వేరు ధ్యాస ఉండదు. బుసలుగొని తలచుట్టు బారాడు భుజగములు సాంధ్యకిమ్మీర ప్రభలుగూడేతనువూ, యెముక పేరుల మర్మరమూ, బింబాధరంబు గదంబించు తాంబూలమూ, పరుపులై పడు కల్పపాదపంబులపూలూ, వెన్నెలలు పలపలని చిలికించినట్లు, తెలిబూదిపూత తెట్టలు గట్టినట్టు, మంచుగుప్పలు గూర్చినట్టు ఆడే శివుడూ కళ్ళకు కట్టేసరికి సద్యఃపరనిర్వృతి కలుగుతుంది. ఆవేశముతో అవి అల్లే తీగలతో పాకి మొగిలిపూల తావులతో విహరించి, తొలుకారు మెఱపులతో దోబూచులాడి, అచ్చెరువు రూపుగొనినట్లు నిలుస్తాము. ఘల్లుఘల్లుమని కాళ్ళ చిలిపి గజ్జెలు మ్రోగుతూనే వుంటాయి. ఝణుత, తిధిగిణత, తధిగిణత అని మద్దెళ్ళు మ్రోగుతూనే వుంటాయి. మకరకుండల చకాచకలు విసురుతూనే వుంటాయి; కంఠహారాళి కదలిపోతూనే వుంటుంది. మనము లెక్కేమిటి; పరవశత్వమున శ్రీపతియే చెమరుస్తాడు.

శివుడు లోకేశ్వరుడు, విశ్వేశ్వరుడు, సర్వేశ్వరుడు. ఆయన నాట్యము నాట్యమునకే పరాకాష్ఠ.

తలపైన జదలేటి యలలు, మూడవకంటి కటిక నిప్పులు, మర్మరము సేయు యెముక పేరులు, పులితోలు హొంబట్టు, క్రొన్నాగు మొలకట్టు, బిరుదాడు

పదకింకణులు నటరాజు ఆహార్యము. అంగ ప్రత్యంగ ఉపాంగ చలనము తారహారముల కదలాట, సుందర మంజీరకింకిణులూ, కుండల విలాసమూ, చంచల హస్తాభినయమూ, నృత్తనృత్య తాండవగతులూ, ఆయన ఆంగికము. జిగజిగ లాడే నక్షత్ర కలాపము, ఫక్కున నవ్వు కైలాసశిఖరములు, ధిమిధిమి ధ్వనులూరు గిరిగర్భములూ, నాట్యములు వెలయించు నదులూ జలదాంగనలై వచ్చిన వియచ్చరకన్యలూ ఆయన నాట్యరంగ ప్రసాధనము. షడ్జద్వయము నందించు వేణు మయూరములూ, పంచమ మాలపించు పికమూ, నిషాదమును తరుము వెనకయ్య బృంహితమూ, ఆ నాట్యములోని స్వరనాదములు. గంధర్వులు, అచ్చరలు, కిన్నరులు, నిర్జరులూ, దిక్పాలకులు, మునులూ, శరజన్ముడు, విఘ్నేశ్వరుడు, అమ్మవారు, బ్రహ్మ, సరస్వతి, శ్రీపతి, లక్ష్మి, చంద్రుడు, సర్వలోకాలూ ఆ మహానాట్యానికి ప్రేక్షకులు. కవిగారి వ్యుత్పత్తి తీర్చిన ఈ శివతాండవములో పై సమ్మర్దము పూర్తిగా నిండుగా కానవస్తుంది.

నారాయణాచార్యులుగారు విజయనగరాస్థాన విద్వద్వరేణ్యులు తాతాచార్యుల వంశములోనివారు. విజయనగర సారస్వత విభూతి వీరి రచనలో అక్కడక్కడ మెరుస్తూ ఇంపు గొలుపుతుంది. ఆంధ్ర వాఙ్మయానికి అభిశాపరూపమైన చంపూపద్ధతిని వీడి ఈయన తెలుగు జిగిని చక్కగా వెలయించగల పదఛందస్సును స్వీకరించుట ఈయన చైతన్యమును ప్రకాశింపజేయు దీపము.

శివతాండవమును విన్న తర్వాత వీరినోట కృష్ణలీలలు వినాలని వున్నది నాకు! మీకులేదూ! మరొకమారు వినండి శివతాండవము.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి.
19-7-1961

ప్రచురణల రిజిస్ట్రారు
Office of the Registrar
-12

# ముందుమాటలు

ఆంధ్రదేశములో—యీ ఖండ కావ్యమునకు గొప్ప ప్రచారము వచ్చినదని చెప్పవచ్చును. నా యితర కృతి మేఘదూతకును తెనుగు దేశమున నిట్టి ప్రచారమే గలదు. కాని 'శివతాండవము' లోని విశేషమేమనగా-యితర భాషల వారు గూడ దీనిని ప్రేమింపగల్గుట, నైనిటాల్‌లో మహాదేవి వర్మ, దినకర్ మొదలైన హిందీ కవులు దీనిని నాలుగైదు సారులు వినుట తటస్థించినది. వీరికి భాష తెలియదు. దీనిలోని శబ్దసమ్మేళనము వారి నాకర్షించినదనవచ్చును. వారెల్లరు దీనిని హిందీలో కనువదించవలసినదిగ ప్రోత్సహించిరి. అపని యీనాటికిని నెరవేరలేదు. నా హిందీ కవిమిత్రులలో అగ్రగణ్యులైన దినకర్, జానకీ వల్లభశాస్త్రి మొదలైన వారిప్పటికిని అదేమాట యనుచుందురు. కాని, దీని నెన్నటికైనను సలక్షణముగ ననువదింపగలుగుదునో, లేనో చెప్పలేను. ఢిల్లీ మొదలైన ప్రదేశములలో కృపలానీ, దేశముఖ్ వంటివారు యీ రచనకు హర్షించిరి.

తిరువాన్కూరులో నున్నపుడు మళయాళ పండితులు గూడ దీనిని చదివించికొని విన్నారు. దీనిలోని సంస్కృత రచన వారి నెంతయో యాకర్షించి నట్లున్నది. మొన్న (24-5-61) కలకత్తాలోగూడ శివతాండవ పఠన జరిగెను. అక్కడి చపలకాంతరాయ్, కాళిదాసముఖర్జీ మొదలైన పెద్దలు యీ కావ్యమును విని చాల ఆనందపడినారు. దీనిలోని సంస్కృత కవిత్వము, నాగరిలిపితో ముద్రించిన బాగుండునని వారిచ్చిన సలహా.

పరమశివుని తాండవ భాగమంతయు ఉద్ధతశైలిలో నడచినది. లాస్యము లలితమైనది. అక్కడి శైలినిగూడ లలితముగనే నడపితిని. పరమశివుని తాండవమునకు ముందు నంది యొనర్చిన నాంది గలదు. అట్లే పార్వతి యొనర్చిన లాస్యమునకును తొలుత విజయ యను చెలికత్తె చేసిన ప్రార్థనమున్నది. ఇవి రెండును సంస్కృత రచనలు.

దీనిలోని గుణదోషములకు రసికులు ప్రమాణము.

కడప
1-6-1961

గ్రంథకర్త

# అభిప్రాయము

శ్రీమాన్ నారాయణాచార్యులుగారు చెప్పిన 'శివ తాండవ' కృతి ఆకర్షించి ఆనందపరవశుఁడ నైనాను. ఈ కావ్యము ఆంధ్ర సరస్వతికి ఉజ్జ్వల నూతనాలంకారము. కల్పన అతిలోకము. సంగీత. సాహిత్య. నాట్యసంకేతములు సరసముగా. సలక్షణముగా ఈ కృతిలో యిమిడిపోయినవి. అర్థము, గంభీరము, ఆశయము అత్యుదాత్తము. నా దృష్టిలో ఆధునిక సారస్వతమున యిటువంటి గేయకృతి యింకొకటి లేదు.

ఇతి శివమ్!

తల్లావఝల శివశంకర శాస్త్రి






# శివతాండవము

ఏమానందము
భూమీతలమున!
శివతాండవమట[1] !
శివ లాస్యంబట[2] !

అలలై, బంగరు
కలలై, పగడపుఁ
బులుఁగులవలె మ
బ్బులు విరిసినయవి
శివతాండవమట!
శివలాస్యంబట!

వచ్చిరోయేమొ! వి
యచ్చర కాంతలు
జలదాంగనలై
విలోకించుటకు
శివలాస్యంబట!

అంగహారములును, కరణములును ప్రధానముగాఁగలిగి యుద్ధత ప్రయోగమైనది తాండవము. (సంగీత రత్నాకరము.)
సుకుమారాభినయలయమై శృంగారపోషకమైనది లాస్యము. (సంగీత రత్నాకరము.)



యేమానందము
భూమీతలమున!
పలికెడునవె ప
క్షులు ప్రాఁబలుకులో!
కల[1] హైమవతీ[2]
విలసన్నూపుర
నినాదములకు
న్ననుకరణంబులో!

కొమ్మల కానం
దోత్సాహమ్ములు
ముమ్మరముగ మన
ములఁగదలించెనో!
తలనూచుచు గు
త్తులుగుత్తులుగా
నిలరాల్చును బూ
వులనికరమ్ములు

రాలెడు బ్రతి సుమ
మేలా నవ్వును!
హైమవతీ కుసు
మాలంకారము
లందునఁ దానొక
టౌదు నటంచునో!

1 అవ్యక్తమధురమైన. 2. పార్వతీదేవియొక్క.


లలితా మృదు మం
జులమగు కాయము
పూవుల తాకుల
తో వసివాడదా!
భారతియట పా
ర్వతికి నలంకా
రముఁదీర్చెడునది!
రమణీయస్మిత
ములఁ గావించునో
యలరులు మృదువులు!
చతురాననుఁడే
సవరించునట
శర్వునకుత్తమ
సర్పవిభూషలు!
వీచె విశ్వైత
కీచకములు మృదు
వీచులుగాఁ ద
చ్చిత్రలోకమ్ములు
మారుతములు గో
టీరి తాజ్ఞుఁడగు
శివునకు సేవలు
జెల్లించుటకై





తకఝుం తకఝుం
తకదిరికిట నా
దమ్ములతో లో
కమ్ముల వేలుపు
నెమ్మిగ నిలఁబడి
నృత్యమాడునెడ
లయానుగతిఁ గ
క్రమముగా శ్రుతిఁబ
ట్టుటకో! గొంతులు
సవదరించు ను
త్కటభృంగమ్ములు.

ఈ సెలకన్నెల
కెవ్వరుజెప్పిరో!
యా సర్వేశ్వరు
నభినయమహిమను
కుచ్చెళులెల్లెడ
విచ్చలవిడిగా
దుసికిళ్ళాడఁగ
నసమునఁ బరుగిడు—
ఓ హో హో హో!
యూహాఽతీతం
బీయానందం
బిలాతలంబున!



సంధ్యాసతి! యీ
సంభ్రమ మేమిటె!
నవకుసుంభరా
గవసనమేమిటె!
ఆకుంచిత తి
ర్యక్ర్పసారి ల
జ్జామధుర కటా
క్షపాతమేమిటె!
విలాసవక్రిత
విచలన్మధ్యం
బునహ్రీమతి! నీ
వునువలెనే చిఱు
పలుకని మేఖల
వాలక మేమిటె!
యెవ్వరికోసర
మీబిబ్బోకము!
శివపూజకా! యో
చెలువా! యీ కథ
లెవ్వరు జెప్పిరె?
యిలాతలంబే—
ఆడెడునట నా
ర్యాప్రాణేశ్వరుఁ
డో పైనమణి! నిలు




రా! దినమంతయుఁ
బడమటి దేశపు
వారలకీ కథ
నెఱిగించుటకై
పరుగెత్తెదవో!

అల మృగములు క
న్నుల బాష్పమ్ములు
విడిచెడు నెందుకు!
విశ్వేశ్వరునకు
అడుగులుగడుగుట
కై పాద్యంబో!!!

గుసగుసమని యీ
కిసలయములు స
మ్మదపూరముగా
మాటలాడునెదా!!
యేమున్నది! లో
కేశ్వరునాట్యమె

ఓ హో హో హో
ఊహాఽతీతం
బీయానందం
బిలాతలంబున!!







# నంది నాంది

అర్ధేందూత్ఫుల్ల కేశం స్మితరుచిపటలీదంశితం[1] గౌరవర్ణం
తా ర్తీయీకం[2] వహంతం నయన, మహికుల ప్రత్నభూషావితానం
వృత్తా[3] రంభాఽట్టహాస ప్రవిచలితకకుప్చక్ర, మానందకందం
తం వందే నీలకంఠం త్రిదశపతి శిరశ్చుంబిపాదాఽబ్జపీఠం.

వ్యాఖ్యానానాం స్వయంభుప్రముఖపరిషదాం దూరతోవర్తమానై
ర్లోకాఽఽలోకోత్సవై స్తై రవిదితగతిభిర్విభ్రమైస్సారతారై:
కుర్వంతం దేవకాంతా హృదయవలభిషున్యాస ముద్రాం స్మరస్య
త్రైలోక్యాఽఽనందదానప్రవణ, ముపనిషత్ప్రాణ మీశం భజామః

పాటలజటాఘటిత జూటరుచికోటిభృశపాటిత తమిస్రవలయం
కూటశబరం పటునిశాటకుల ఝాటసుఖమోటనర సైకనిలయం
కోటిశతకోటి సమకోటి నయనోత్థిత కృపిటభవ దగ్ధమదనం
నాటితభువం ప్రళయనాటక మహారచన పాటవచణం హృదిభజే.

మత్తగజకృత్తియుతముత్తమమహర్షి గణచిత్త వనకోకిలమజం
నిత్యసుఖదం, త్రిదశకృత్యఫలదం, భువనమర్త్య పరిరక్షణచణం




1. కవచితమైన. 2. మూడవదియైన.
3. అభినయవర్జితమై, గాత్రవిక్షేపముమాత్రమే కలిగినది నృత్తము.


భావపరిముగ్ధ గిరిజావనజతుల్యపదయావకరసాఽ క్త శిరసం[1]
పీవరభుజం ప్రమథ జీవనమముం సకలపావనతనుం హృదిభజే.

గంగాతరంగకణసంగ వికాసిజూటం
సంధ్యాంతరిక్ష మివ తారకితం[2] దధానః
నృత్యత్పదాఽగ్ర పరికల్పిత వేదజాతః
కుర్యాద్దయాం, త్రిభువనాఽఽలయదీప ఏషః

దధన్నేత్రం గౌరీప్రణయముకురం[3] మండనవిధౌ
ప్రసన్న స్మేరాఽస్యం లలితలలితం చాంద్రశకలం
మహాసంవిద్రూపం భుజగపతి భూషం శ్రుతిసతీ
వతంసం శంసామః కిమపి బ్రహ్మాసరసం.

గౌరీకటాక్ష రేఖా
చంద్రకితం[4] వక్షఆదధానాయ
పింగళజటాయనమో
గంగాకమనాయ, వేదవేద్యాయ.

1. పార్వతీదేవి పదతామరసమునందలి లత్తుకచే రంజిపఁబడిన శిరస్సు గలవాఁడు భరతశాస్త్రమందు "నిటాలతిలక" అను స్థానవిశేషము గలదు. ఆ యభినయమునందుఁ బాదముతోఁ దిలకముంచికొనునట్లు దానిని నిటలముపై నిలుపవలెను. పార్వతి యాయభినయనమును జూపించుచుండగా నామె కాలు శివుని శిరస్సునకుఁ దగిలినది. ఇద్దానినే "లలాట తిలక" మనియు వ్యవహరింతురు.
2. నక్షత్రములచేతఁ గూడినది.
3. శివుని నేత్రములందు నీడఁజూచుకొని పార్వతి తన యలంకారమును దిద్దుకొనుటచే, నతని నేత్రమామెకు లీలాదర్పణమైనది.
4. నెమలి కన్నులవంటి కన్నులుగల.





కాష్ఠాఆస్ఫోటయంతం, కహకహనినదైర్భీషణై రట్టహాసైః
హస్తవ్యాక్షేపభంగైః, ప్రసభమపద్రుతం వ్యోమ కుర్వంతముచ్చైః
పాదాఽఽఘాతైరధోగాం, సవనగిరి గుహాకోటి ముత్కంపయంతం
ధిం ధిం ధిం శబ్దఘోరం హృదివికటమహాకాల మాలోకయామః.

భటచ్ఛటనదచ్ఛిఖాపటలపోషణం భీషణం
బహిర్హుతవహం సృజన్విషమలోచనాఽభ్యంతరాత్
ప్రమత్తఇవ నృత్యతి ప్రచలితాఽఖిలాంఽగస్స యః
స్సమాఽఽపతతు మానసే తుహినశైల కూటోచ్ఛ్రితః.

బధ్నన్ నృత్తాంఽతరాంతః ప్రగళితమహిపాఽఽకల్పితం పట్టబంధం
సంబాధోద్భిన్నఘోరశ్వసిత హుతవహాఽఽదీప్తదంష్ట్రావిటంకం
ప్రోత్తాలస్స్వైరధీరైః పదయుగలమహాఽఽస్ఫోటనైః కల్పయంతం
నానాభంగాన్ అయాఽబ్ధౌ భ్రుకుటితనిటలం శూలినఁ సంస్మరామః.

జయ జయ శంకర! శత్రుభయంకర!
జయ జయ ప్రమథ పిశాచవశంకర!
జయ జయ తాండవ సంభ్రమసుందర!
జయ జయ ధైర్యవిచాలితమందర!



జయ జయ శీతలచంద్రాఽఽభరణా!
జయ జయ కరుణా శరణాఽఽచరణా!
జయ గగనాంబర! శాతత్రిశూలా!
జయ శుభంకరా! జయ మహాకాల!

ధక్కారవముల పిక్కటిల్ల దశ
దిక్కులు మారుత దీర్ఘీకృతములు
ఝుణఝుణఝుణత స్వనములకును ప్రతి
నినదము లీనఁగ వనధి భంగములు


శూలంబున నాభీలత లేవఁగఁ
గీలాచయములు లేలిహానములు[1]
ధగధగితములై నిగుడఁగ నగవులు
గగనతలస్థులు బెగడ దేవతలు

నీ నృత్తములో నిఖిల వాఙ్మయము[2]
తానముగా మఱి గానము గాగను
తాండవింపఁగా తరుణంబై నది
ఖండేందుధరా! గదలుము నెమ్మది

జయ నాదలయాఽఽసాదితమూర్తీ!
జయ జయ తాండవ సంభృతకీర్తీ!
జయ గగనాంబర! శాతత్రిశూలా!
జయ శుభంకరా! జయ మహాకాల!


1. సర్పములు. 2. సర్వవాఙ్మయము పరమశివుని వాచికాభినయము (అభినయదర్పణము ;





# శివతాండవము

క॥ శ్రీరమణీ లలిత కటా
క్షారోపణ చంపక ప్రసవమాలా శృం
గారిత వక్షుండు దయా
వీరుఁడు బరదైవ మెడఁద వెలిఁగెడుఁ గాతన్.

ఉ॥ కన్నులఁ గల్వచూపులు వికస్వరము ల్గగనాంచలంబులన్
దన్నఁగ, ధింధిమి ధ్వనులు దట్టములై ప్రతిశబ్ద మీన నా
సన్న గుహాంతరాళముల, సాంధ్యలఁదాండవమాడు దుఃఖితా
పన్న[1] శరణ్యుఁ డీశ్వరుఁడు, భావమున న్గిగిరించుఁగావుతన్.

తలపైని వేదలేటి యలలు దాండవమాడ
నలలఁ త్రోపుడుల క్రొన్నెల పూవు గదలాడఁ
మొనసి ఫాలముపైన ముంగురులు చెఱలాడ
కనుబొమ్మలో మధుర గమనములు నడయాడ
కనుపాపలో గౌరి కసినవ్వు[2] బింబింప
కనుచూపులను తరుణకౌతుకము చుంబింప
కడఁగి మూడవకంటఁ గటికనిప్పులు రాల
కడుఁబేర్చి పెదవిపైఁ గటికనవ్వులు వ్రేల
ధిమిధిమిధ్వని సరిద్గిరిగర్భములు తూఁగ
అమిత సంరంభ హాహాకారములు రేగ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు




1. దుఃఖితులైన యాపన్నులు. 2. ఎలనవ్వు.

కిసలయజటాచ్ఛటలు ముసరుకొని వ్రేలాడ
బుసలుగొని దలచుట్టు భుజగములు బారాడ
మకరకుండలచకాచకలు చెక్కులఁ బాయ
అకలంక కంఠహారాళి నృత్యము సేయ
ముకుజెలమలో శ్వాసములు దందడింపంగఁ
బ్రకటభూతిప్రభావ్రజ మావరింపంగ
నిటలతటమున చెమట నిండి వెల్లువగట్ట
కటియుగమ్మున నాట్యకలనంబు జూపట్ట
తకఝుణుత ఝుణత యను తాళమానము తోడ
వికచనేత్రస్యంది విమలదృష్టుల తోడ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

భుగ భుగ మటంచు నిప్పులు గ్రుమ్మ నూరుపులు
ధగధగిత కాంతి తంద్రములుగాఁ గకుభములు
దంతకాంతులు దిశాంతముల బాఱలు వాఱ
కాంత వాసుకి హస్త కటకంబు డిగజాఱ
భావోన్నతికిని దాపటి మేను వలపూఱ
భావావృతంబు వల్పలిమేను గరుపాఱ
గజకృత్తి కడలొత్తి భుజముపై వ్రేలాడ
నజుఁడు గేల్గవమోడ్చి "హరహరా" యని వేడ
ఝుణుత తధిఝుణుత తదిగిణత యను మద్దెలల
రణనంబు మేఘ గర్జముల దూసుక పోవ





ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

ఎగుభుజమ్ములు దాచి నగుమొగమ్మున జూచి
వగలురమ్మునఁ దూచి భావాభిరతి నేచి
తరళతంద్రమ్ము మధ్యమ్ము కిట కిటలాడ
వరసాంధ్యకిమ్మీర[1] ప్రభలు దనువునఁ గూడ
కుణియునెడ[2] వలయంపు మణులు చిందఅలాఁడ
కిణుకిణు మటంచుఁ బదకింకిణులు బిరుదాఁడ
శృంఖలారుండములు చెలగి తాండవమాఁడ
శంఖావదాత లోచనదీప్తి గుమిగూడ
వలగొన్న యెముక పేరులు మర్మరము సేయ
పులకింపఁగా నొడలు మురజంబులును మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

మొలక మీసపుఁ గట్టు, ముద్దుచందురు బొట్టు
పులితోలు హొంబట్టు, జిలుఁగు వెన్నెల పట్టు
నెన్నడుమునకు చుట్టు క్రొన్నాగు మొలకట్టు
క్రొన్నాగు మొలకట్టు గురియు మంటల రట్టు
సికపై ననల్పకల్పక పుష్పజాతి, క
ల్పక పుష్పజాతిఁ జెర్లాడు మధురవాసనలు

1. అనేక వర్ణములుగల. 2. ఆడు.



బింబారుణము కదంబించు దాంబూలంబు
తాంబూల వాసనలఁ దగులు భృంగ గణంబుఁ
గనుల పండువుసేయ, మనసునిండుగఁ బాయ
ధణధణధ్వని దిశాతతి బిచ్చలింపంగ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

సకల భువనంబు లాంగికముగా శంకరుఁడు
సకల వాఙ్మయము వాచికము గాఁగ మృడుండు
సకల నక్షత్రంబులు కలాపములు[1] గాఁగ
సకలంబు దనయెడఁద సాత్త్వికంబును గాఁగ
గణనఁ జతుర్విధాభినయాభిరతిఁ దేల్చి
తన నాట్యగరిమంబుఁ దనలోనె తావలచి
నృత్యంబు[2] వెలయించి నృత్తంబు[3] ఘోశిపించి
నృత్త నృత్యములు శబలితముగాఁ జూపించి
లాస్యతాండవ[4] భేద రచనాగతులు మీఱ
వశ్యులై సర్వదిక్పాలకులు దరిఁజేర

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

1. భూషణము.
2. రసభావాశ్రిత నాట్యము.
3. చూడు. "నృత్తారంభాట్టహాస"
4. చూడు. "శివతాండవమట, శివలాస్యంబట"





అంగములు[1] గదురఁ బ్రత్యంగంబులును[2] చెదర
హంగునకు సరిగా నుపాంగంబులునుఁ[3] గుదుర
తత సమత్వాదు లంతఃప్రాణదశకంబు[4]
అతి శస్తములగు బాహ్యప్రాణ[5] సప్తకము
ఘంటాసదృక్కంఠ కర్పరము గానంబు,
కంఠగాన[6] సమాన కరయుగాభినయమ్ము
కరయుగము కనువైన కనులలో భావమ్ము
చరణముల తాళమ్ము చక్షుస్సదృక్షమ్ము
ఒరవడిగ నిలువంగ నురవడిఁ దలిర్పంగ
పరవశత్వమున శ్రీపతియున్ జెమర్పంగ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తల, చేతులు, చంకలు, పార్శ్వములు, నడుము, పాదములు.

మూపులు, భుజములు, వీపు, కడుపు, తొడలు, పిక్కలు.

చూపు, రెప్పలు, నల్ల గ్రుడ్లు, చెక్కిళ్లు, ముక్కు, దవుడలు, అధరము, దంతములు, నాలుక, గడ్డము, మొగము, శిరస్సు.

వడి, నిలుకడ, సమత, చపలత్వము, చూపు, శ్రమములేమి, బుద్ధి, శ్రద్ధ, మంచిమాటలు, పాట.

మృదంగము, తాళము, వేణువు, పాట, శ్రుతి, వీణ గజ్జెలు, గాయకుఁడు.

కంఠముచేత గానమును, దానిలోని యర్థమును హస్తాభినయము చేతను, భావమును గనుల చేతను, లయను పాదముల చేతనుఁ జూపింపవలెనని నాట్యాచార్య సంకేతము.




పుట్టపర్తి

కర ముద్రికల[1] తోనె గనుల చూపులు దిరుగ
తిరుగు చూపులతోనె బరుగెత్త హృదయమ్ము
హృదయమ్ము వెనువెంట కదిసికొన భావమ్ము
కుదిసి భావముతోనె కుదురుకోగ రసమ్ము
శిరము గ్రీవమ్ము పేరురముహస్త యుగమ్ము
సరిగాగ మలచిగండరువు[2] నిల్పిన యట్లు
తారకలు[3] జలియింప తారకలు నటియింప
కోరకములై గుబురు గొన్న జూటము నందు
సురగాలి నలి రేఁగి చొక్కి వీచినఁ యట్లు
పరపులై పడఁ గల్పపాదపంబులఁ బూవు

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

మొగ్గలై ప్రేమంపు బుగ్గలై యమృతంపు
నిగ్గులై దమలోన మొగ్గరంబులు గట్టి
నును సిగ్గుతో ముడిచికొని పోయెడు విధాన
పెను వెఱపుతో రాలి వణకాడెడు విధాన
పలపలని వెన్నెలలు జిలికించెడు విధాన
రోసంబు గ్రసియింప రూక్షమైన విధాన
వేసరికతో సరిగ వికసింపని విధాన

1. హస్తముద్రిక యేవైపునకుండునో దానియెడ దృష్టియు, దానియందు మనస్సును, మనసునందు భావమును కేంద్రీకరింపవలెనని నాట్యాచార్య సంకేతము. అప్పుడే రసోద్భూతి కలుగును. 2. బొమ్మ. 3. కనుగ్రుడ్లు



అచ్చెరువుతో స్తబ్ధమై నిల్చిన విధాన
గుచ్చలుగఁ దిగ కన్నుఁ గొనలఁ జూపులు బెనఁగ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తరితీపు వెన్నెలలు విరిసికొన్న విధాన
నెఱ జాదులవి కుప్ప నెఱసికొన్న విధాన
తెలిబూది పూఁత దెట్టులు గట్టిన విధాన
చలికొండ మంచు కుప్పలు గూర్చిన విధాన
పొసఁగ ముత్తెపుసరు లొప్పహళించు విధాన
అసదృశము నమృతంబు నామతించు[1] విధాన
ఘనసారమును దెచ్చి కలయఁ జల్లు విధాన
మనసులో సంతసము గనులఁ జాఱు విధాన
గులుకునీలపుఁగండ్లఁ దళుకుఁ జూపులు బూయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

మబ్బుగము లుబ్బికొని ప్రబ్బికొన్న విధాన
అబ్బురపు నీలములు లిబ్బిసేరు విధాన
నల్లి గలువలు దిక్కులెల్ల విచ్చు విధాన
మొల్లముగఁ దుమ్మెదలు మొనసికొన్న విధాన
మగలు కాటుకకొండ పగిలి చెదరు విధాన




1. పిలుచు.

తగిలి చీకటులు గొప్పగఁ గప్పెడు విధాన
తనలోని తామసము కనులఁ జాఱు విధాన
తనలోని వ్రతమె కనులఁ దీఱు విధాన
కులుకునీలపుఁగండ్ల దళుకుఁజూపులు బాయ
ఘల్లుమని కాళ్ళఁజిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తమ్ములై, ఘటితమోదమ్ములై, సుకృతరూ
పమ్ములై, శాస్త్రభాగ్యమ్ములై, నవకోర
కమ్ములై, వికచపుష్పమ్ములై, తుమ్మెదల
తమ్ములై, భావమంద్రమ్ములై, హావఫు
ల్లమ్ములై, నూత్నరత్నమ్ములై, వల్గుహా
సమ్ములై, గన్గానలసొమ్ములై, విశ్రాంతి
దమ్ములై, రక్తికిసలమ్ములై, రక్తిచి
హ్నమ్ములై, తంద్రగమనమ్ములై, గెడఁగూడి
కులుకునీలపుఁగండ్ల తళకుఁజూపులు బాయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తరగలనుఁ జిఱుగాలి పొరలు లేచిన యట్లు
విరుగాలిలోఁ దమ్మి విరులు గదలిన యట్లు
విరులలో నునుతావి తెరలు లేచినయట్లు

తెరలపై చిత్రాలు పరిఢవించిన యట్లుఁ
కమ్మకస్తురివీణె గఁడగ విరిసిన యట్లు
నెమ్మి దనపింఛమ్ము నెమ్మి విప్పిన యట్లు
చిగురుటాకులు గాలి వగలు వోయిన యట్లు
నగవులో లేవలపు బిగువు జారిన యట్లు
కులుకునీలపుఁగండ్లఁ దళుకుఁజూపులు బూయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

మొగలి పూవులు దావిఁ బుక్కిలించిన యట్లు
తొగకన్నె నీలంపునగవు జార్చిన యట్లు
నవవసంతపుశోభ భువిఁ గప్పికొన్నట్లు
శివుచెంత శర్వాణి సిగ్గు జారిన యట్లు
కన్నెమదిఁ గోరికల కలలు దూకిన యట్లు
సన్నజాజుల తేరు సంధానమైనట్లు
పచ్చిసంపెగపూలు బరవులై బడినట్లు
అచ్చెరువు రూపుగొని యాక్రమించిన యట్లు
కులుకునీలపుఁగండ్లఁ దళుకుఁ జూపులు బూయ
ఘల్లుమని గాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు



నగవులే నగవులై, బిగువులే బిగువులై
సొగసులే సొగసులై, జూడ్కులే జూడ్కులై
తొలుకారు మెఱపుల్లు దోబూచులాడినటు
తొలిచూలికన్నె కోర్కెలు విచ్చికొన్న యటు
తొలుసారి రతి వింతసొలపు గ్రమ్మిన యట్లు
తొలిగట్టుపైజొత్తు బులకరించిన యట్లు
తొలుసంజలోఁ దెల్వి దూకివచ్చిన యట్లు
మలుసంజలోఁ గాంతి మరలిపోయిన యట్లు
కులుకునీలపుఁగండ్ల దళుకుఁజూపులు బాయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తీగలై, సోఁగలై, దీరుకొని బారులై
మూగికొని జొంపమై, మురిపెంపు దారులై
మలకలై, మొలకలై, మలపుఁగొని నేరులై
పొలపంబు వెలయించి పూల దొలుకారులై
ముడులుగొని సుడులుగొని మొగుడుకొని మొగ్గలై
జడిమగొని దడఁబడుచు వడకి కడుఁ దగ్గులై
చలువ గొని కెలకులను నెలవుకొని మూఁగలై
పిలపిలమటంచు తావులుమూఁగ బాగులై
కులుకునీలపుఁగండ్ల దళుకుఁజూపులు బాయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ



ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

మలక మెఱపులు కొన్ని, నిలువు మెఱపులు కొన్ని
సొలపు మెఱపులు కొన్ని, సూది మెఱపులు కొన్ని
కోల మెఱపులు కొన్ని, క్రొత్త మెఱపులు కొన్ని
చాలు మెఱపులు కొన్ని, జాఱు మెఱపులు కొన్ని
ప్రక్క మెఱపులు కొన్ని, సొక్కు మెఱపులు కొన్ని
నిక్కు మెఱపులు కొన్ని, నిండు మెఱపులు కొన్ని
క్రేళ్లు మెఱపులు కొన్ని, క్రేటు మెఱపులు కొన్ని
సుళ్ళు మెఱపులు కొన్ని, త్రుళ్ళు మెఱపులు కొన్ని
కులుకునీలపుఁకండ్లఁ తళుకుఁ జూపులు బాయ
ఘల్లుఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

గరులుగల యంపగమి కరణిఁ దిరిగెడు కొన్ని
యఱమోడ్పు కనుదోయి సణగిపోవును కొన్ని
ఉయ్యాలతూఁగులై యూగులాడెడు కొన్ని
తేయెంపవలె దిట్టమై యేఁచు మఱి కొన్ని
పందెపు గురాలవలెఁ బరుగులాడును కొన్ని
మంచముగ మంచువలె మలసి తిరుగును కొన్ని
గ్రిందుమీదై యాడిగిలఁ బడును మఱి కొన్ని
సందుసందున నక్కి సాగిపోవును కొన్ని



కులుకునీలపుఁగండ్లఁ తళుకుఁజూపులు బాయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు ప్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

కరశాఖలను నూర్మికలు వోలె లగియించి
కరబంధములను కంకణములై జిగి నించి
కరరుహంబుల యావకపుజొత్తు పండించి
యఱుత నూతన తారహారములు నిండించి
చరణముల మంజీర సౌందర్యములు గూర్చి
యురముపై నెఱఁబూఁత నెఱసినటు రుచిఁ జేర్చి
యవలగ్నమున మేఖలవలె జల్లునఁ జుట్టి
శ్రవణములఁ కుండలవిలాస సంపద గట్టి
కులుకునీలపుఁగండ్ల తళుకుజూపులు బాయు
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు
ఎలగాలిపైఁ దేలి పొలయు గీతిక వోలె
యెలపాప బెదవిపై మలయు నవ్వును వోలె
కులపాలికా ముగ్ధ[1] కిలికించితము[2] వోలె
జలదాంగనా లలితసంచారములు వోలె




1. నవ వివాహిత.
2. రోషాశ్రుహర్ష భీత్యాదులు సంకరముగాఁగలుగు శృంగారచేష్ట

ప్రణయరథమునఁ తూగిపడు కింకిణులు వోలె
ప్రణయార్ద్రహృదయమున పారాడు వెలుఁగు వలె
సెలకన్నె యెడఁదలో తలఁపు గలగలల వలె
చలివెలుఁగు వెన్నెలల మొలకతుంపరల వలె
కులుకునీలపుఁగండ్ల తళుకుఁజూపులు బూయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

చిఱునవ్వు పొరలపై నొఱసి జారును కొన్ని
యరుణ గండములపై నంటి యాడును కొన్ని
నెమలిపింఛము వోలె నెఱసి విరియును కొన్ని
కుముదముల తేకులై కులుకు వోవును కొన్ని
యిలయు నాకాశమ్ము కొలఁత వెట్టును కొన్ని
తళ తళలు వెలయించి తఱచు కప్పును కొన్ని
యడ్డంబు నిడుపులై యమరి నిల్చును కొన్ని
అడ్డమాఁకయు లేక యాడిపోవును కొన్ని
కులుకునీలపుఁగండ్లఁ దళుకుఁ జూపులు పూయ
ఘల్లుమని కాళ్ళఁ జిలిపిగజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.





సమశీర్షకముతోడ[1] సమదృష్టి[2] ఘటియించి
సమపాద[3] విన్యాస చాతుర్యము లగించి
వరపతాకమ్ము[4] దాపటి కేల నెసకొల్పి
వామహ స్తం బధో వ క్త్రముగ సంధించి
త్రిపతాకమూని[5] యర్ధపతాకమును[6] బట్టి
చపలదృష్టులు దిశాంచలములను మోపెట్టి
ధూతమ స్తము[7] చెల్వు దోబూచు లాడంగ
వీతరాగులు ఋషులు వినుతులను సేయంగ
ఇలయెల్ల చెలువు రూపె త్తి నిల్చిన యట్లు
కలలెల్ల నిజములై గానుపించిన యట్లు

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

హంసాస్యమును[8] రెండు హ స్తంబులను నించి
అంసభాగంబులకు నానించి చూపించి

1. క్రిందికిగాని, పైకిగాని, పంపక, యె త్తక, సమానముగా నుంచిన శిరస్సు.
2. తెప్పపాటు లేని దృష్టి.
3. సాధారణముగా నిలువబడినట్లుండును.
4. అన్ని వ్రేళ్ళను చాచి, బొటన వ్రేలిని, చూపుడు వ్రేలి కడపటి గెణుపున కానించి చూపుట
5. పతాకహ స్తమున అనామికను వంచి చూపుట.
6. పతాకమునఁ జిటికెనవ్రేలిని వంచి చూపుట.
7. ఎడమ కుడిప్రక్కలకుఁ గదలించెడు శిరస్సు.
8. నడిమివ్రేలు మొదలు మూడు వ్రేళ్ళను ఎడముగలవిగాఁజాచి యంగుష్ఠమును తర్జని వ్రేలితోఁజేర్చికట్టిన హంసాస్యము.



కలికి చూపుల చంపకములు పై జల్లించి
కెలఁకులకుఁ గంఠమ్ము మెలఁపుతో నాడించి
కనుగ్రుడ్లు గనుల చక్రముచుట్టి చుట్టిరా
ధనువులై బొమలు తద్దయుఁ గాంతి చూపరా
నొకకాలు దివిఁగొల్వ నొకకాలు భువినిల్వ
ప్రకటముగ దేవతావరులు భక్తినిఁ గొల్వ
ఇలయెల్ల చెలువు రూపెత్తి నిల్చిన యట్లు
కలలెల్ల నిజములై కానుపించిన యట్లు

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

ఒకసారి దిరములై యుండి కాంతులు గ్రుమ్మ
నొకసారి గంటువేసికొని ఫూత్కృతి జిమ్మ
నొకసారి మనుబిళ్ళ యోజ ఛెంగున దాటు
నొకసారి వ్రేలు పాడిన పూలరేకులై
యొకసారి దుసికిళ్ళ వోవు బిఱుచేపలై
యొకసారి ధనువులై యుబ్బుఁ గన్నుల బొమ్మ
లిలయెల్ల చెలువు రూపెత్తి నిల్చిన యట్లుఁ
కలలెల్ల నిజములై గానుపించిన యట్టు

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

కనుదోయి సైగలకుఁ గనుబొమలె బదు లొసగ
మనసులో నూహలకు తనువె బులకలు దాల్ప



ప్రతిపులకలోఁ దీవ్ర భావములు వాసింప
ప్రతియడుగులో లయోన్నతి తూగి శోభింప
నవ్వులకుఁ గింకిణుల నాదములె ప్రతినవ్వ
నవ్వులేమువ్వలై నాట్యమున నెలుఁగివ్వ
నెలుఁగులను శ్రుతిరుతులు నెలయు నంఘ్రులగతులు
కలసియో! కలియకో! కడుఁగ్రొత్త రుచి నివ్వ
ఇలయెల్ల జెలువు రూపెత్తి నిల్చిన యట్లుఁ
కలలెల్ల నిజములై గానుపించిన యట్టు

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

స్తంభ యుగమో, నీపశాఖాద్వయమొ, మత్త
కుంభికర కాండములో, గొనబైన దీగెలో,
సుమ దామములో, శిరీషములె నిల్చిన విధమొ
కమల రజములు రూపుగట్టి వచ్చిన మెలపొ!
తటి దుదంచిత కాంతి తాండవంబో యనఁగ
అటువైపు నిటువైపు నమల హస్తములూగి
కనవచ్చుచును మందగతిని గదలినయప్డు
కనరాకయును శీఘ్రగతినిఁ బరుగిడినప్డు
ఇలయెల్ల చెలువు రూపెత్తి నిల్చిన యట్లుఁ
కలలెల్ల నిజములై గానుపించిన యట్టు

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.







పడగలెత్తును నాగుబాములై యొకసారి
ముడిచికొను కమలంపు మొగ్గలై యొకసారి
జ్ఞానముద్రికలఁ బక్షము లెత్తు నొకసారి
దీనదీనంబులై తేలాడు నొకసారి
కటకాముఖంబులై[1] కనుపట్టు నొకసారి
పటు ముష్టి[2] బంధ సంపదఁజూపు నొకసారి
శుకతుండ[3] హస్తమున శోభిల్లు నొకసారి
ప్రకట భ్రమరీసరళి[4] పరగించు నొకసారి
అటువైపు నిటువైపు నమల హస్తములూగి
అటమీఁద లిటఁగ్రింద నందములు జెల రేఁగి

యాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

కైలాస శిఖరములు కడఁగి ఫక్కున నవ్వ
నీలిమాకాశంబు నిటలంబుపై నిల్వ
నందికేశ్వర మృదంగధ్వానములు బొదలఁ
తుందిలాఽకూపార తోయపూరము దెరలఁ

1. చూపుడు వ్రేలును, అనామికయు, బొటనవ్రేలితో మొగ్గవలెఁ బట్టవలెను.
2. నాలుగు వ్రేళ్ళను జేర్చి యరచేతిలోనికి వంచి యంగుష్ఠమును మీదజేర్చిన ముష్టిహస్తము.
3. పతాకమున జూపుడు వ్రేలును, అనామికయువంచిన శుకతుండము.
4. నడిమి వ్రేలితో బొటన వ్రేలిని దాకి చూపుడు వ్రేలిని వంచి తక్కినవి జూపిన భ్రమరము.





జేదలెల్లఁ గనువిచ్చి సంభ్రమత తిలకింప
నదులెల్లఁ మదిఁబొంగి నాట్యములు వెలయింప
వనకన్యకలు సుమాభరణములు ధరియింప
వసుధయెల్లను జీవవంతమై పులకింప


నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

అదిగదిగో! జలదకన్యక జూచు నేమిటో
సదమలంబై నట్టి శంకరుని నాట్యమ్ము
నవిగో! మయూరమ్ము లాలపించు నదేమి!
శివునితాండవకేళి శివకరము షడ్జమ్ము
చికిలిగొంతుకతోఁడ పికము గూయు నదేమి!
సకలేశ్వరుని శ్రుతి స్థాయికై పంచమము
వాయుపూరితవేణువర్గ మే మందించు!
ఆయభవుఁ దాండవముకై తార షడ్జమ్ము

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

ఒకవైపు నర్ధచంద్రకరంబు[1] బరగించి
యొకవైపు సూచీ[2] ముఖోద్వృత్తిఁ జూపించి
క్రీగంటితో నవ్వు క్రేళ్ళురుక వీక్షించి
మ్రాఁగన్ను వైచి తన్మయతఁ దా నటియించి

1. పతాకమున నంగుష్ఠమును క్రిందకడ్డముగాఁ జూచిన అర్ధ చంద్రము.
2. కటకాముఖమునఁ జూపుడు వ్రేలు జూచిన సూచీహస్తము.



వామపాదము జక్కఁగా మహిని నాటించి
నేమమున దక్షిణము నింత మీఁదికి నెత్తి
యయ్యాలతూఁగుతో నూగులాడఁగ మధ్య
మొయ్యనొయ్యన మువ్వ లూగి నవ్వులు నవ్వ

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

కుడికాలి నంబువలెఁ గొంచెముగ మునువంచి
యెడమపాదము వైపు నింతశీర్షము వంచి
కమలనాళములు హస్తములు బారలు సాచి
ప్రమదమ్ముతో రెండువైపు లల్లనఁ జాచి
సవ్యవక్షము బులకచయముతో నుబ్బంగ
సవ్యేతరము సిగ్గుతో వెన్క కొదుగంగ
నొక గపోలము నగవు వికసించి రాగిల్ల
నొక గపోలము బిగువు బ్రకటించి తోషిల్ల

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

ఎడమచేతినిఁ బ్రీతి నడుముపై సంధించి
కుడిచేతిలో నంచకొదమగుఱుతు[1] లగించి
యంచముక్కున దృష్టి నంచితంబుగఁ జేర్చి
సంచాలితమొనర్చి సమశిరము[2] ముందునకు

1. హంసాస్యము చూ. "హంసాస్యమును రెండు."
2. చూ॥ "సమశీర్షకము."

పరివాహితముఁ[1] జూపి పైపైని కాంతమ్ముఁ
పరగించి చూపు భావావేశ మధురమ్ము
నటుదూగి యిటుదూగి చటులమ్ము గజకృత్తి
నటనమధ్యమ్ములో నయముగాఁ గడకొత్తి

యాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

ఒకకాలు వెనుకకై యొకకాలు ముందుకై
మొకమెల్లఁ జిరునవ్వు మురిపెముల ముద్దయై
గుడిచేతి యందు లఘుకోణత్వము ఘటించి
ఒడికంబుగాఁ దలము పడగవలె కుంచించి
పెరచేత గురుకోణ మరుదుగాఁ దావలచి
కరశాఖలను వంచి శిరము వెన్కకుమలఁచి
వెనుకఁజూచిన యప్డు వెన్నెలలు జిలికించి
మునుముజూచిన యప్డు ముద్దులే బండించి

యాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు.

హస్తంబు కనుదోయి కడ్డంబుగా నిలిపి
శస్త్రంబరాశంపు[2] సంజ్ఞ నెదురుగ మలపి
ధూతంబు శిరము[3] సాకూతంబు కనుచూపు

1. చక్రాకారముగఁ ద్రిప్పఁబడు శిరము పరివాహితము.
2. పతాకమున జూపుడుప్రేలు పంచిన అరాళహస్తము.
3. చూ: "ధూతమస్తకముచెల్వు."



ప్రీతిఁగావింప నిల్చిన దేవతల కెల్ల
నాభికెదురుగ దక్షిణంబైన హస్తమ్ము
శోభలనుజల్లింప సోలపద్మపుముద్ర[1]
ఒకవైపు గటిభాగ మొయ్యారముగ నొత్తి
సకలలోకముల కాశ్చర్యంపు సిడమెత్తి

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

తకిటతక, తకతకిట, తకతకిట, తకిటతక
తకతదిగిణతొగిణతొ, కిటతకతదిగిణతొ
కిటతకతదిగిణతొ, కిటతకతదిగిణతొ
పటులంబులగు జతులు[2] సరిగాఁగఁ దూగించి
ససరిరిస[3] , రిగరిరిస, సరిగాగ, రీగాగ

గసగాగ ధపసాస

రి రి స రి స స రి గా గ   రీ గా గ రి గ రి రి స
స రి సా స  పదపాప  సరిగ నెత్తులుముడిచి

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

1. అన్ని వ్రేళ్లను సందులుగలవిగాఁ ద్రిప్పి పట్టిన సోలపద్మము.
2. మృదంగ వరుసల ప్రస్తారము.
3. మోహనరాగ స్వరములు.





మేళకర్తల నెత్తి యాలాపనము దీర్చి
యాలాపనమ్ములో నక్షులను నఱమోడ్చి
సంవాదివాదు లనుస్వరములను జూపించి
క్రొవ్విరుల గుచ్ఛములు గునిసిపోయిన యట్లు
గమకములు వెలయించి కడఁగి జారులుబట్టి
ప్రమదమ్ముతోడ మూర్ఛనలెల్ల రాఁబట్టి
మంద్రమధ్యమతార మధురిమలు జూపించి
సాంద్రమ్ముగా గానసాగరమ్మును రేపి

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

వక్రరాగము నెత్తి, పాండిత్యధీరతో
పక్రమణమును బూని, ప్రక్కవాద్యముఁ జూచి
కనకాంగియే[1] యంచు కనుఁగోనలనె నవ్వి
వినిపించి, శుద్ధస్వరవిచయంబునె ద్రవ్వి
కాలువిడు[2] పఱియు ముక్కాలుచోటుల నెత్తి
కోలుఁ జూపించి, నిక్కుఁగఁ బల్లవుల పాడి
కాలభేదములతోఁ గలితనం బెలయించి
సోలు నిర్జరమనస్సుల నెల్ల వంచించి

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

1. కనకాంగిరాగమున కన్నియు శుద్ధస్వరములే గలవు.
2. పాటలోని యెత్తుగడ భేదములు.

మధ్యమము[1] రాగసామ్రాజ్యాధిదైవతము
శుద్ధమ్ముగాఁ[2] బ్రతిగఁ జూపించి వణకించి
వణకులో నొక గ్రొత్త వాలకము కనుబరచి
తని పూవులను బుట్టలను దెచ్చిపోసినటు
గలగలమనంగఁ జిఱుగవ్వలను వెదికినటు
బలపలని యెండుటాకుల మర్మరములట్లు
నాదధేనువు బొదుగునందు దుగ్ధము జాఱ
భేదవాదము రాగవీథిలో బుడమాఱ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

స్వరకన్యకల గుబ్బచనులఁ బుల్కలు రేపి
సురకాంతలకు కోర్కెలెరయ నెమ్మదులూపి
లయపురుషు[3] నానందరాశిలో మునిగించి
రయముతోఁ దాళముల రవణములు హత్తించి
ఝల్లరీముఖవాద్య చయము మేనులుదాల్చి
యుల్లములఁబొంగెత్తి "యో" యంచు నెలుఁగివ్వఁ
దంబూర యానంద తరళసంప్లవ
త్త్వంబుతోఁ దానుగా గళమువిచ్చుకపాడ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

1. సామాన్యముగ నన్ని రాగములు మారుటకును, మధ్యమ స్వరమే మూలము. అందుచే నది యధిదైవతమైనది.
2. శుద్ధము గా శుద్ధమధ్యమము. బ్రతిగ ప్రతిమధ్యమము.
3. తాళము లోని సామ్యము.



వల్లకీసుఁచరులు పుల్ల రాగములీన
కల్లోలమయిపోవ గంధర్వ హృదయములు
అచ్చరలగన్నులం దానందబాష్పములు
బెచ్చుగా గండముల విరిసికొన హాసములు
గిన్నరీహస్తముల సన్నగాజులు మురిసి
చెన్నుగాఁబలుక సుజ్జీవములు పాటలను
షలుకుఁ పల్కున నమృత భరము తుంపెసలాఁడ
నిలువెల్ల గానమే నిండికొని వెలి కూర

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

సరిగాగ రూపించి షడ్జమము పట్టంగ
శరజన్ము తేజి పింఛమువిప్పి నర్తింప
ఋషభస్వరంబు కుల్కించి పాడిన నంది
వృషభంబు చెలరేగి వియతిపై లంఘింప
నందంబుగా ధైవతాలాపనము సేయ
గంధర్వ లోకంపుఁ గనులఁ బూవులు బూయఁ
బనిఁబూనుచు నిషాదస్వరము రక్తికిఁ దేఁగ
వెనకయ్యబృంహితము వెనుకఁ దరుముక రాగ

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

ఎత్తుగడ కెత్తుగడ కేరీతిఁ దోచునో!
గ్రొత్తతీరులను గ్రొంగ్రొత్తభావము లాచి

సరసిలో లేయలల తెరలవలె నుబుకునో!
స్వరసంపకములోని జాతులను వెసమార్చి
మానత్రైష్ణ్యం బదెంతటిదో! తాళము వేయఁ
బూని యమరులు తప్పిపోయినా రెచ్చటనో!
శ్రుతిలయంబెంత పెచ్చుగ రేగెనో! సర
స్వతిగుండె కంపించి జలజలా బారంగ

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

అఱపల్కు వచియించి అక్షులను బూరించు
పూరించునర్థంబు పొందించు హస్తముల
మొదలఁ గన్నులఁ గొంత ముచ్చటించును, మిగులుఁ
గదియించు వాఙ్మయాఖండ పుణ్యము బండఁ
గనులసైగలు మాట పెనవేసి చూపించు
వెనుక మాటలుబల్కి, మును దీర్చుఁ గనులను
వచియించిపల్కు, లావల నేత్రముల దిద్దు
ఖచరులెల్లరును దిగ్భ్రమ మొంది వీక్షింప

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

సంయుతకరంబులను[1] శాస్త్రాను సారంబ
సంయుతకరంబులను[2] జక్కఁగాఁ గదియించి

1. రెండు చేతుల హస్తముద్రలు సముదితములై యొక యర్థమును జూపించిన సంయుతహస్తమని పేరు.
2. ఒక చేతిలోనే భావముజూపు ముద్రకు అసంయుతహస్తమని పేరు.



శాస్త్రమునుదాటి తన స్వాతంత్ర్యమును బూని
శాస్త్రకారులయూహ సాగుమార్గముఁ జూపి
భావరాగముల సంబంధంబు, రాగ లీ
లావిశేషంబు నుల్లాసంబు గదియింప
భావమే శివుఁడుగా భ్రమరి చుట్టెడు భంగి
భావలయమెల్ల మదిఁ బొంగి యాడెడుభంగి

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

స్థలపద్మములువోలె నిలుకడగ నిలువఁబడి
మెలఁగుకూర్మమువోలె మెల్లగాఁ జలియించి
యావైపు నీవైపు నల్లనల్లనఁ దిరిగి
భావింప గజగమనభంగి ముందుకు సాగి
వాలుగల కులుకు వలె వంకరలు జిత్రించి
వ్రాలి, నాగమువోలె పార్ష్ణి భాగం బెత్తి
వెనుకభాగంబెత్తి, మునుము నేలకు నొత్తి
యనుకొనని యందమ్ము లలరింపఁ బదతలము

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

ఎలగాలిఁ గదలు నాకులువోలెఁ దేలికై
యలలతూగుడులఁ దమ్ములపూవు లట్టులై
కన్నె కనుబొమలోని కలలబరు వట్టులై
మిన్ను గన్నట్టి చిఱుమేఘముల యట్టులై

కలికి బిగిగౌగిలింతల హాయి కొల్లాడి
చెలిచెక్కుపై సిగ్గు చెలువంబు నుగ్గాడి
యవనీకుచస్థలంబట్టుగా బిరుసెక్కి
వివిధరీతుల నేర్పు వెలయింపఁ బదతలము

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

కోనలును కొండలును కోల్మసఁగి తలలూప
కొనగోలువలికి సాకూతంబుగాఁ జూచి
డక్క చెక్కును గీటి డంబుగాఁ బలికించి
యెక్కడను దననాట్యమే మాఱుమ్రోయంగఁ
దానె తాండవమౌనా! తాండవమె దానౌనా!
యేనిర్ణయము దనకె బూనిచేయఁగరాకఁ
దామఱచి, మఱపించి తన్నుఁ జేరినవారిఁ
గాములీలగ మూఁడుగన్నులను సృష్టించి

యాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

ఒకసారి దనుమఱచు నుప్పొంగునాట్యమున
నొకసారి మఱపించు నూది, తాండవకళనె
మఱచిమఱువక యొక్కపరి యాంగికము వట్టు
నెఱసంజవైపు కన్గిటిపి సైగలుసేయు
నొకవైపు దాండవం బొకవైపు లాస్యమ్ము
న్నొకవైపు గాంభీర్య, మొకవైపు శృంగార
మొకవైపు భస్మంబు, నొకవైపు జిత్రకం
బొకవైపు భేదదృ, క్కొకవైపభేదముగ





నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

నీలసూత్రము[1] లోన నిక్కి యఱ్ఱులుసాచి
కూలంకషమ్ముగాఁ గూయు జిలుగజ్జియలు
జిలిబిలి పదంబులను పలుకు నొక్కొకసారి
కలకలమటంచు నవ్వులు జిల్కు నొకసారి
చెలువంబు వడబోసి చిఱునవ్వు నొకసారి
కొలఁదిమీఱంగ ఫక్కున నవ్వు నొకసారి
మూఁగసైగలతోనె మురిపించు నొకసారి
రాగలాపనమందు రణియించు నొకసారి

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

జననాంతరంబులో సంసక్తమయి వచ్చి
మనసులోతుల నిల్చి, మాటాడు వాసనలో!!
యమృతమయమై యాత్మనంటిన సుషుప్తిలోఁ
గమముగా నవ్వు నిర్జరమహచ్ఛాయలో!!
ప్రమదంబె రూపెత్తు బంగారుకలలలో
నమరకాంతలు సేయునట్టి కనుసైగలో
యన సూక్ష్మతమముగా, నటు సూక్ష్మతరముగా
వినఁబడియు, వినఁబడనివిధిగ మువ్వలు మ్రోఁగ

పాదముల యందలి గజ్జెలు నీలసూత్రమునకే గూర్చవలెనని యాచార్యమతము.

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

కరుణఁ జూపియప్డు దొరఁగు బాష్పమ్ము ల
చ్చెఱువు జూపినయప్డు జిగినించు నిశ్చలత
వీరంబులో సగ్గి వెడలించుఁ దారకలు
ఘోరంబులోఁ గెలంకులఁ గొల్చుఁ గనుగ్రుడ్లు
వికృతంబులో వంగి వికటించుఁ గనుబొమలు
వికచంబులగును దారకలు హాస్యమునందు
శృంగారమున విలోలిత దృష్టిపాతంపు
భంగి, రౌద్రమున దుర్భరకటాక్షములతో

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

భావాంబరమున కావల వెల్గు దైవంబు
భావగోపీనాథుఁడై వేడ్కఁ జెలఁగించి
రాగిణీవిభ్రమము లక్కడక్కడ దీర్చి
రాగాలపనజన్య రమణీయతలు బేర్చి
యొకయడుగు జననంబు, ఒకయడుగు మరణంబు
ఒకభాగమున సృష్టి, యొకవైపు బ్రళయంబుఁ
గనుపింపఁ దిగకన్నుఁగొనలు మిన్నుల నంట
మునిజనంబుల హృదయములు దత్పదం బంట

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు




సమమధ్యద్రుతగతులు జరణముల, అనుకూల
భ్రమణములు నడుమలో ప్రౌఢమేలు వ్యాకృతుల
బయిపైని గప్పికొను భావబంధంబులును
నూరేసిగజ్జియల[1] నులివులో వేదములు
తీరైన నృకపాల హారముల గానములు
తొలుకాడు గంగమ్మ యలలలోఁ దానములు
మొలిపించి, జందురుని మొగముపైఁ జిఱునగవు

లాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

భరతముని ముందుగా బదపద్మములుబట్టి
'హరహరా!' యని ప్రమోదాయత్తుఁడై దూఁగ
తనసృష్టిగర్వంబు తలఁగిపోఁగ విరించి
కనులలో బాష్పములు గట్ట డీల్పడి నిలువ
నావైపు నీవైపు నష్టదిక్పాలకులు
కేవలము రసమూర్తులై, విశ్వమును మఱువ
దన వేయికనుఁలు జాలని బిడౌజుడు, గౌత
ముని శాపమున గొఱంతనుఁ గూర్చి చింతింప

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

[1] ఒక్కొక్క కాలియందును నూరేసిగాని, యిన్నూరేసిగాని, దక్షిణపాదమున నూరు వామపాదమున నిన్నూరుగాని గజ్జెలు గట్టికొనవలెనని నాట్యాచార్యమతము.



హరియె హరుఁడై, లచ్చి యగజాతయై, సరికి
సరి, దాండవములాఁడ సమ్మోదరూషితులు,
హరునిలోహరిఁ జూచి, హరియందు హరుఁజూచి
వెఱవేది దేవతలు విస్మితులు, మునులెల్ల
రధిగతానందభావావేశ చేతస్కు
లెదవిచ్చి, యుప్పొంగి, యెగిరి స్తోత్రముసేయ,
భేదవాదములెల్లఁ బ్రిదిలిపోవఁగ, సర్వ
మేదినియు నద్వైతమే బ్రతిధ్వనులీన

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

శోకమ్ము సంతోష మేకమ్ము, నరకంబు
నాకంబు నేక, మ్మనంత మాకాశమ్ము
పరిగతంబగు భూమి, నవనిధులు బల్వములుఁ,
తరులు బీజములుఁ, గ్రొవ్విరులు కసిమొగ్గలును
జరతాంధకారంబు, బరిణాహిచంద్రికలు,
పరమఋషు లజ్ఞాన భరితు, లందఱకు నేఁ
డద్వైత మద్వైత మని మాటి
కద్వయముగా నొత్తి, యఖిలలోకము లార్వ

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

ప్రతితారకయు విచ్చి, ప్రత్యణువుఁ బులకించి
శితికంఠునకు నపుడు సెల్లించినది సేవ.



యానందసాగరం బంతటనుఁ గవిసికొన
మానములుఁ దిమిఘటలు మేదినీజీవములు
బ్రతిప్రాణిహృదయమ్ము వల్లకీవల్లరిగ
మతిమఱచి పాడినది మధురసంగీతమ్ము,
జగమెల్ల భావంబె, సడియెల్ల రాగంబె
జగతియే యొక నాట్యసంరంభముఁనుగాగ

నాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

చూచువా రెవ్వరా చోద్యంబు! నందఱును-
సూచింత్రు దాండవము, సొక్కి సమ్మోదమున
శంకరుఁడె కెమ్మోవి సెలవులను జిఱునవ్వి
పంకించి తల, నటక వర్గంబు వీక్షించె
హరుఁజూచి హరినవ్వె, హరుఁడె హరియైనవ్వె
విరిసికొనె నొకవింత వెన్నెలలు లోకముల
శ్యామసాంధ్యస్ఫూర్తి జంద్రికలలో డాఁగెఁ
గామించెఁ బ్రకృతిఁ జీకటులో! జ్యోత్స్నతతియొ

ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

నవజటాపటల సంధ్యాకాలవారిదాం
తవికాసిచంద్ర మంద్రాతపార్ద్రశరీర!
నగకన్యకానేత్రయుగళనిర్యత్కటా
క్షగణతాపింఛ పింఛాధీనగురువక్ష!



నిగమదాసీ సమున్నిద్రసా హైూనినా
ద! గణనీకృతనై కతారహాగవిలాస!
భూతేశ! భూతభావాతీత! యనిపల్కి
స్తోత్రములఁ బఠియింపఁ జోద్యమున వై కంఠుఁ

డాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

పద్మామనోజ్ఞ యావక పుష్పితశరీర!
పద్మసుందరనేత్ర! భావాంబరాతీత!
మాయాసతీభుజా మధుపరీరంభాఽవి
షయవివేక! హృషీకసంచయాఽగ్గిష్ఠాత!
శౌరి! నీ తేజమే సంక్రమించెను నన్ను
పూరించెఁ దాండవము పూర్ణ చిత్కళతోడ!
నని నిటాలమునందు హస్తమ్ములను మొగిచి
వినతుఁడై శంకరుఁడు విష్ణువును నుతియించి

యాడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు





# విజయా ప్రార్థన

కలకలరణత్కాంచీ, పంచాస్త్ర జీవనమూలికా
నిగడితహరప్రేమా, శ్యామా[1] సదృక్షవపుస్థలీ
మునిజనమనఃపేటీ, చేటీకృతారవల్లభా
జయతి కరుణాపాంగా, చంద్రావతంస సధర్మిణీ!

విరావై ర్మాంజీరైః కిమపి కథయంతీవ మధురం
రహస్యంవేదానాం, లలిత లలితాన్ దృష్టివలయాన్
కిరంతీ, శ్యామాంగీ, కుచభర నమన్మధ్యలతికా
నటంతీ, పాయాన్నః పరమపదధామా, హరవధూః

మకరతరుబామై దంపర్యం, మునీశ్వరమండలీ
సుచరితఫలం, కాంతం, కటాక్ష తరంగితం
ప్రమదహృదయోపేతం, కదంబవనాశ్రయం
కిమపి సుభగం తేజశ్శివాఖ్య ముపాస్మహే.

నతానాం భక్తానాం నయనయుగ బాలార్కసుషమా
మహర్షి ణామాశా, త్రిదశతరుణీ కైశ్యఘటితా
స్వసంపర్కోత్సేకా త్స్వపది శివయంతీ శివతనుం
శివంకుర్యాన్మాతుః పదవనజపాటల్యలహరీ!




1. ప్రేంకణపుఁదీగె.

మదిరాఘూర్ణితనేత్రా
మదగజగమనా, మనోజ్ఞతరవదనా!
మనసి మమ సన్నిధత్తాం
మాతంగీ! మధ్య నిక్వణత్కాంచీ!

అనుభవరసికై ర్జ్ఞేయా
మాదిమజననీం! హృదబ్జమధుధారాం!
నీలమణిసదృశ దేహాం
బాలాం, తా మాశ్రయే మహోరూపాం!







# శివాలాస్యము

ఫక్కుమని నవ్వినది జక్కవల పెక్కువల
జక్కడచుచనుదోయి నిక్కపార్వతి యపుడు
నిక్కుచనుదోయిలో నిబిడరోమోద్గమము
దిక్కుదిక్కులనెల్ల దివ్యనేత్రోత్సవము!

తెగమిగులు దొగల జిగి బుగులు గన్నులదోయి
నిగనిగలు మిట్టింప నిలచి చూచెను గౌరి
నిలుచువాలకములో నెలవంపు, వంపులో
కులికినది యమృతమో; కోటిసౌందర్యాలో!

బంధూకపుష్పసంబంధు వగు చిరుపెదవి
నందముగ గదియించె నలసహాసం బార్య
యానవ్వులోఁ గదలె నచ్చరలసిగ్గులో!
కాని యీశ్వరు కలలో! కామధేనువుపాలో!

స్థలపద్మములయొప్పు గల తామ్రతలపాద
ములఁ గదల్చెను దేవి మురిపెములు జిలికించి
కదలుకదలికలోన కలకలా నవ్వెనఁట
కొదమగంటలో నిల్చికొన్న స్వరకన్యకలో!

లలితముగఁ బలికినది మొలనూలు, కోయిలల
జిలుఁగుగొంతుక తీపి జలజలా పారించి,
యా వాకలో నిల్చె నాగమాంబురుహమ్ము
లావిరులపై నాడె నానందబ్రహ్మమ్ము!



జంకించినది లలిత చపల భ్రూలతలతో
శంకరునిశర్వాణి జలద సుందరవేణి
తటుకునను సూచిహస్తంబుతో, నాగేంద్ర
కటకునకు ధైర్యంబు కంపించిపోయినది!

అటు బండె నొకసారి యతివ కిలికించితం
బిటు విరిసె నొకసారి యింతి యుల్లోకితము[1]
ప్రమదాకపోలమ్ము భావకిమ్మీరితము
కమనీయ మదరాగ కలికా విచుంబితము

కుణుకుణు క్వణనంబు లనుగతిక్రముగఁ బాద
నణుమధ్య జూపినది యభినయ విభేదములు
వనములను, వనధికంకణములను, జగతిలో
నణువణువునను భావ మాక్రమించిన దపుడు

తరళలోచన వింత తానకంబుల నిలివి
కరపద్మముల నర్థకమలంబుఁ జూపించె
నా సృష్టి నందుకొన కమరులును దేవర్షు
లాశంకితులు, నద్భుతాక్రాంతమానసులు—

గా నించినది దేవి, కలకంఠశ్రుతివీథి
లో, నిత్యరమణీయలోకములు పొంగెత్త
పలికినవి వల్లకులు కలకంఠిగానమ్ముఁ
పలికినవి వల్లకులా! పరమేశ్వరియొగాని

1. మీదికి నిక్కింపఁబడిన దృష్టి యుల్లోకితము.




తకఝుణుత ఝుణుతతక, తకిటతది గిణతో తది
గిణతో, తదిగిణతో యను రణనములు మీఱఁగ
ప్రతిగజ్జెయెడఁదలో, భావములు బులకింప
ప్రతిభావమున రసము వాఱి దిక్కుల ముంప

ప్రియురాలి యూరువులు ప్రేరేప చషకమ్ము[1]
పయి మందవలితమ్ములయి లేచు తరగలటు
బాలేందుఫాల, నగబాల, పార్వతి నిలిపి
లీలావిపర్యాప్త రేచితభ్రూలతలు[2]

పరివాహితము శిరము[3] చిఱునవ్వు, నెత్తమ్మి
విరికన్నుఁగవలందు విభ్రమాలోకితము[4]
కించిదాకుంచితము, చంచలము, బొమదోయి
పంచాస్త్రబాణమ్ము, పర్వతేశ్వరు సుతకు

1. ఆమె రేచిత భ్రూలతలు చాల లలితముగ వగువడినవి అవి యెట్లున్నవనగా, ప్రియురాలు ప్రియునకు మద్య మందించునపుడు ఆమె యూరువులచేత వామద్యపాత్రమున లేచు మద్య తరంగము లంత లలితముగ నున్నవి.
2. అందముగ మీఁది కెత్తఁబడినవి.
3. వింజామరమువలె ఇరుప్రక్కలకు వంచు శిరస్సు పరివాహితము.
4. తిరుగుడు గల చూపు ఆలోకితము.




నవశిరోభేదములు[1] నవకంబుగాఁ జూపి
భవురాణి యుష్టగుణభావదృష్టులు[2] మోపి
పదిరెండుహస్తములు[3] బట్టి, మదిరాక్షి మఱి
పదిలంబుగాఁగ గ్రీవాభేదములతోడ

ఆడినది గిరికన్నె యలసమారుత మట్లు
పాడినది సెలకన్నె పకపకా నవ్వినటు
లాటపాటల తోడ నవశులై బ్రహ్మర్షి
కోటులెల్లెడ సమిత జూటులై సేవింప

శరదభ్రధూళిపింజరితమ్ముల చక్రముల
సరిదూగు లావణ్యభరిత కుచయుగ్మములు
చనుకట్టు నెగమీటి మినుఁ దాకునో! యనగ
వనజాక్షి, పైపైని పక్షమ్ము విరియించి
యాడినది గిరికన్నె!

ఒకవైపు భ్రూభంగ మొదిగించి చూచినది
వికచసాకూతముగ విశ్వేశ్వరుని లలిత

1. నమము, ఉద్వాహితము, అధోముఖము, ఆలోలితము, ద్రుత కంపితములు, పరావృత్తో త్క్షిప్తములు, పరివాహితము.
2. సమము, ఆలోకితము, సాచి, ప్రలోకితము, నిమీలితము, ఉల్లోకితము, అనువృత్తము, అవలోకితము, దృష్టులు.
3. ఇచ్చట హస్తశబ్దము హస్తప్రాణముల కొపచారితము, హస్త ప్రాణములు పదిరెండు. ప్రసారణ, కుంచిత, రేచిత, పుంఖిత, అపవేష్టితక, ప్రేరిత, ద్వేష్టిత, వ్యావృత్త, పరివృత్త, సంకేత, చిహ్న, పదార్థటీకలు.



యా చూచుచూపుతో నర్ధేందుభూషునకు
పూచిపోవఁగ బుష్పముకుళములు నిలువెల్ల
నాడినది గిరికన్నె!

మేఖలాచంద్రకిత మృదుమధురమౌ మధ్య
మాకంపితంబయ్యె నగరాజప్రియపుత్రి
కా కంపితంబులో నలసవ్రీడాభరం
బాకేకరితదృష్టి[1] యనురాగసూచకం
బాడినది గిరికన్నె!

సవ్యహా_స్తం బర్ధచంద్రాఽభినయముతో
దివ్యలీలను నిలిపి, దేవి నడుమునయందు
కొనగోట నుదుటఁ గ్రమ్మిన జెమ్మటలు మీటి
కొనచూపులనె శివుని కోర్కె లోతులు దూటి
యాడినది గిరికన్నె!

కోపఘూర్ణితమైన కొదమనాగము వోలె
తీపులగు నూరువులు దెసలెల్ల జల్లించి
యలసవలితములు చేతుల భంగిమలతోడ
జలజారిమకుటు గన్నుల వాన లెపకొల్పి
యాడినది గిరికన్నె!

నడునాపలిపై నున్న నాభినామము కరఁగి
వడిజాతి కనుబొమల వంకలను విలువంగ




1. కనుబొమ్మలు పైకెత్తిన దృష్టి.



క్రొత్తఁదోమిన దంతకోరకంబుల గాంతి
గుత్తులుగ గుత్తులుగ హత్తికొన శివుపైని
యాడినది గిరికన్నె!

సమపాదయుతమైన స్థానకస్థితి నిలచి
క్రమముగాఁ జూపులను కంజాక్షి విరజిమ్మి
ఘలుఘల్లుఘలు మనెడి వలయనాదములతో
చిలిపినవ్వుల సుమాంజలి పట్టి శివునకై
యాడినది గిరికన్నె!

వెలయంగఁ దొమ్మిదగు విధములను చెలువముగ
నలినాక్షి భూచారినాట్యములు[1] జూపించి
పదునాఱగు ఖచారిపద్ధతుల[2] నెసగించి
మదిరాక్షి గతిచారి మధురిమలు బొసఁగించి
యాడినది గిరికన్నె!

శిరము చూపులు మించు చెక్కిళ్ళు కనుబొమలు
తరుణాధరము పయోధరములును దంతములు
ముఖరాగచిబుకములు మొదలైన వావగలు
సకియ, భావానుగుణ చాలనంబుల నెసఁగ
నాడినది గిరికన్నె!

1. నేలపైనిలిచి చేయు నాట్యము.
2. పైకి చెంగించుచుఁ జేయు నాట్యము.

శుకతుండనిభ కుచాంశుకము వదులుగ జాఱ
మొకముపై ముంగురులు ముసరుకొని విడఁబాఱఁ
బంచవన్నెలకాసె వగలుగులుకగఁ, విమల
చంచలాక్షుల కటాక్షాంచలమ్ములు మిగుల
నాడినది గిరికన్నె!

సమరూపములగు నంసములుఁ గటి కంఠములు
సమపాదములు నంగసమరూపచలనములు
నురుము పెక్కువయు, సుందర భావప్రకటనము
సరసీజముఖి నాట్యసౌష్ఠవమ్మును జాట
నాడినది గిరికన్నె!

ఆవైపు నీవైపు నతిరయంబునఁ దూగ
భావభవు తరవారినా వెలయు కీలుజెడ
చలితనాట్యమున కాశ్చర్యపరవశుఁడగుచు
లలితేందుధరుడు దానిలువఁ దిన్నఁగనగుచు
నాడినది గిరికన్నె!

పూఁవు గుత్తులనడుమఁ బొలుచు గిసలయమువలె
తా విమలమర్దళాంతరమునను నిలుచుండి
పలుమారు నిలమీఁద లలితముగ గ్రుంగి, కిల
కిలకిల మటంచు, మేఖల నవ్వులనుఁ బొదల
నాడినది గిరికన్నె!

జరతపావడ బెఱుఁగు చలియింప, గంటసరి
గరము నటియింప, బంధుర శ్రోణి గంపింప



గరయుగంబుల ఘల్లుఘల్లుమంచు నెలుగించు
వరకంకణములతో భావభవు గంధగజ
మాడినది గిరికన్నె!

కలఁగ చెక్కిళ్ళపయి కస్తూరి మకరికలు
మలఁగ నిటలంబుపైఁ దిలకంబు లలితంబు
నిడుఁదు కన్నులఁ దేరు నీలోత్పలములతో
తడఁబడని లయతోడఁ గడువేగముగ నప్పు
డాడినది గిరికన్నె

ధిమిధిమి యటంచు దుర్దిన వారిధరధీర
భ్రమబూన్చి మద్దెలలు పలుమాఱు ధ్వనియింప
చకితచకితాంగియగు సౌదామనియు వోలె
వికచాక్షి యజ్ఞాత విభ్రంబులు జూపి,
యాడినది గిరికన్నె!

భవుని వక్షమునందుఁ బదలాక్ష చిత్రించి
నవరసంబులకుఁ బుణ్యపు పంట జూపించి
భరతముని నాపంత తరళితునిఁ గావించి
సర్వకన్యలకుఁ ద త్తరపాటుఁ గల్పించి
యాడినది గిరికన్నె!

కుచ్చెళులు భువిఁగుప్పగూరయై నటియింప
ముచ్చెమటతో మొగము మురిపెముల వెలయింప
ముచ్చటగ నిరుప్రక్క ముక్కరయుఁ గంపింప
పచ్చవిల్తునిపూన్కి పారంబు జూపింప
నాడినది గిరికన్నె!

ప్రతిపదములో శివుఁడు పరవశతఁ దూగంగ
సతి చంద్రమకుటంబు సారెకుఁ జలింపంగ
ప్రతతి దూగాడినటు వాతధూతంబౌచు
శతపత్రమది ముక్తసరి విచ్చికొన్నట్టు
లాడినది గిరికన్నె!


గగన వనమున విచ్చికొనిన జలదంబట్లు
వనముననుఁ బారాడు వాతపోతంబట్లు
పోతమ్ము గల్లోలములపైనిఁ దూగినటు
శాతాక్షి గాయమ్ము సంచాలిత మొనర్చి
యాడినది గిరికన్నె!

బ్రహ్మాణి యానంద పారిప్లవాంగియై
జిహ్మాగాక్షముల వీక్షించె మిన్నాకంగ
సకలామరులు శిరస్థ్సలకీలితాంజలులు
సకలేశ్వరునిఁ దన్ను సంస్తుతించుచుండ
నాడినది గిరికన్నె!

ప్రతిసుమము తన్మయత్వమునఁ గిలకిల నవ్వ
ప్రతిపక్షి యున్మాద పరవశత నదియింప
ప్రతిజీవి పులకింపఁ బదునాల్గు లోకముల
నతులితంబైనట్టి యద్వైతమే మ్రోగ
నాడినది గిరికన్నె!

తనలాస్యమును మెచ్చి తరుణచంద్రాభరణుఁ
డనుమోదమునఁ జేతులను గలిపి యాడంగ





Bapu

శివశక్తులొక్కటిగఁ జేరినంతన మౌను
లవికృతేంద్రియ "లో!" మ్మటంచుఁ జాటింపంగ
నాడినది గిరికన్నె!

పలికిరంతటన గీర్వాణులెల్లరుఁ గూడ
చలితకంఠముల శివశక్తులకు మంగళము!
కచ్ఛపీవీణ యుత్కంఠతోడుతరాగ
గుచ్ఛముల నీస నా ఘూర్ణితములుగ దిక్కు
లాడినది గిరికన్నె

దేవాది దేవాయ! దివ్యావతారాయ!
నిర్వాణరూపాయ! నిత్యాయ! గిరిశాయ!
గౌర్యైనమో! నిత్యసౌభాగ్యదాయై!
తురీయార్థదాత్ర్యై!! ధరాకన్యకాయై





శ్రీః

# తాండవ ప్రశస్తి

శ్రీ ఆనందకుమారస్వామి 1914లో శివతాండవమను పేర ఆంగ్లమున నొక వ్యాస సంపుటి ప్రచురించెను. ఆ గ్రంథము నేటికిని రసజ్ఞులకు మోదము కూర్చుచున్నది. అందొక వ్యాస ఖండమున శివతాండవ తత్త్వము వర్ణింప బడియున్నది.

సర్వ ప్రపంచ సృష్టిస్పందనములే శివుని నృత్య భంగులు. ఆరభటీ వృత్తి సమ్మిశితము తాండవమనియు, కైశికీ సమ్మతమైన లాలిత్య శోభలతో నిండినది లాస్యమనియు విబుధుల నిర్వచనము. భర్తృదారికయగు ఉత్తరకు బృహన్నల నేర్పినది లాస్యమని తిక్కన పేర్కొనెను.

సృష్టి పరమేశ్వర లీలయని వేదాంతుల ప్రవచనము. ఈ లీలయే– పరమ వస్తువు– ఏకైక సత్యముయొక్క వ్యక్తరూపము. ఈ భ్రమించుటనే పరమమని నమ్మినవారు భ్రమ పాలగుదురు. ఈ చైతన్యరూపము నుపాశించి, అద్దాని కతీత మైన మూలపదార్థమే సర్వమని, అద్దానికి రెండవది లేదని తపస్వులు తురీయావస్థ యందు కనుగొని, అనుభూతులపొంది ఆ పరమస్థితియందు తాదాత్మ్యమును పొందిరి. అట్టివారు ఈనాటికిని కైవల్యస్థితిని చేకూర్చుకొనగలరు.

ఈ రీతి విపరీతమే–లౌకికదృష్టిలో!

ఈ తాండవ తత్త్వమును మూడు విధములుగా మీమాంసీకరించ వచ్చును. సర్వ ప్రపంచ సృష్టి స్పందన చైతన్య స్వరూపమే శివనృత్యము, అఖిలాండ బ్రహ్మాండ కోటులు అనంతముగ వివిధ భంగులలో కదలుచుండును.

రెండవది: భ్రమనొంది పాశబద్ధులైయుండు జీవకోట్లకు ముక్తి నొసంగు సంహారక్రియా ప్రతీకయే ఈ ప్రళయ తాండవము. పునస్సృష్టికి వలసిన పరమ పవిత్రతను సమకూర్చునదియు ఈ తాండవమే.

మూడవది: తాండవమునకు రంగభూమి చిత్-అంబరము మానవ హృదయాంతర సీమయే. ఇది విజ్ఞులకు వేద్యమగు అనుభూతిశాల. ఇచ్చట పరమశివుడు రంగస్థల మేర్పరచికొని, నృత్యమాడి, జీవునికి మోక్షమిచ్చును.

ఈ తాండవ మాహాత్మ్యము 'చిదంబర ముమ్మని కోవై,' 'తిరుములారి తిరుమంత్రము,' 'ఉన్మై విలక్కము,' 'శివజ్ఞాన సిద్ధియర్' మున్నగు గ్రంథము లందు విపులముగా వర్ణింపబడియున్నది.

(ఓం) శి-వా-య-న-మః యను పంచాక్షరి తత్త్వమే ఈ నృత్యము యొక్క బాహ్య స్వరూప శబ్ద సంపుటియని ఉన్మై విలక్కమున వివరింపబడి యున్నది. ఏ తదుపాసనమే ఉపాసకునికి ద్వంద్వాతీత స్థితినిగూర్చి, శివమును గూర్చుననియు అందు ఉద్ఘాటింపబడినది.

శివప్రదోషస్తోత్రమున:—

కైలాస శైల భవనే త్రిజగజ్జనిత్రీం
గౌరీం నివేశ్య కనకాంచిత రత్నపీఠే
నృత్యం విధాతు మభివాంఛతి శూలపాణౌ
దేవాః ప్రదోష సమయేను భజంతి సర్వే

వాగ్దేవీ ధృతవల్లకీ శతమఖోవేణుందధత్పద్మజః
తాలో న్నిద్రకరో, రమా భగవతీ గేయ ప్రయోషాడ్విఠా
విష్ణుస్సాంద్ర మృదంగ వాదనపటుర్దేవాస్సమం తాత్స్థితా
సేవంతే తమనుప్రదోష సమయే దేవంమృడానీపతిమ్

గంధర్వ యక్ష పతగోరగ సిద్ధ సాధ్య
విద్యాధరామర వరాప్సర సాంగణాశ్చ
యేన్యే త్రిలోక నిలయాస్సహభూతవర్గాః
ప్రాప్తే ప్రదోష సమయే హరపార్శ్వసంస్థాః

# II

సర్వలోక సమస్త భూతకోటికి మోదము గూర్చునది ఈ శివతాండవము. ఇద్దాని వర్ణించు కవి తపస్విగా నుండవలయును. ప్రస్తుత గ్రంథ రచయిత అగస్త్యేశ్వరు నుపాసించి, అద్దేవుని కృపాకటాక్షమునకు పాత్రులై శివ తాండవమును, నంది నాందిని, శివాలాస్యమును, విజయాప్రార్థనమును ఓజోగుణాన్వితముగా, కర్ణరసాయనముగా అభివర్ణించి చదువు వారికి, వినువారికి తాదాత్మ్యానుభవము కలిగించునట్లు ఉత్తమ కావ్యసృష్టి కావించియున్నారు. కావ్యమునకు పరాకాష్ఠ "నైతావద్ ఏన పరో అన్యద్ అస్తి" అను ఋగ్వేదసూక్తి. (కేవల మిదికాదు, పరమమైనది వేఱుగ నున్నది అని స్ఫురింపచేయుటయే.)

వీరు ఈ వస్తు ప్రదర్శనమున శివకేశవులకు అభేద ప్రతిపత్తిని సాధించినారు. సర్వసృష్టి చైతన్యస్వరూపమే నటరాజు తనశక్తిని లీలగా సంకల్పించి, సృష్టిజాలమును సృజించి, తాను వేరైన శేషశయనుడు—రంగనాథుడు లీలానృత్యమునకు ప్రయోక్త, నటునికి ప్రయోక్తకు కార్యభారమున ఏక వ్యక్తిత్వము కలదు. శివము సాధించుటే కైవల్యమును పొందుట!

ఇంతేగాక శివతాండవముచే కలుగు ఆనందప్రతీకయే గిరిజాదేవి. తాండవించు శివుని శరీరములో అమె సాబాలు పంచుకొన్నది.

ఇట్లే కేశవ మోహినీరూపములు. స్త్రీ పురుష సమన్వయ మిచ్చటను పరిస్ఫురించును. ర్యాలి యందలి శిల్ప ప్రతిష్ఠలో భాసించునది ఈ అర్ధనారీశ్వరత్వమే. శివశివా సమ్మేళనము పార్శ్వానుక్రమము. కేశవ మోహినీత్వము ముందు వెనుకల సమన్వయము.

తెలిసికొనవలసినది తత్త్వ మొక్కటియని; రెండవది లేదని.

ఇతిశివ...

మూలస్థానేశ్వరాలయము
విక్రమసింహపురి
24-6-1961

సే. శ్రీకృష్ణమూర్తి.